నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
08.
nipuna
Every Wednesday Free Supplement
7 ఫిబ్రవరి 2024
పేజీలు 8


**ద్విలింగ పక్షి**

ఆడ-మగ రెండు లక్షణాలున్న అరుదైన పక్షిని కనుగొన్నట్లు న్యూజిలాండ్ సైంటిస్ట్, యూనివర్సిటీ ఆఫ్ ఒటాగో జంతు శాస్త్రజ్ఞుడు ప్రొఫెసర్ హమీష్ స్పెన్సర్ జనవరి 2న వెల్లడించారు. ఈ పక్షిని కొలంబియాలో గుర్తించారు. ఇది సగం ఆకుపచ్చ, సగం నీలం రంగులతో ఉంటుంది. ఈ పక్షికి ఆడ, మగ రెండు పునరుత్పత్తి అంగాలున్నాయి. జన్యుపరమైన లోపాలు దీనికి కారణమని సైంటిస్ట్ పేర్కొన్నారు. వందేండ్లలో ఇది రెండో ఘటన.

## అంతర్జాతీయం

**అవినీతి సూచీ**

- ప్రపంచ అవినీతి సూచీలో భారత్ 93వ స్థానంలో నిలిచింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ అనే సంస్థ ఈ సూచీని విడుదల చేస్తుంది. మొత్తం 180 దేశాల్లో వివిధ అంశాలను పరిశీలించి వివరాలను వెల్లడించింది. డెన్మార్క్ అగ్రస్థానంలో ఉంది. చివరి స్థానంలో సోమాలియా ఉంది. 93వ స్థానంలో ఉన్న ఇతర దేశాలు మాల్దీవులు, కజికిస్థాన్, లెసోతో. 2022లో భారత్ 85వ స్థానంలో ఉంది.




**జలమార్గాలకు ఇబ్బందులు**

- భూ రాజకీయ ఉద్రిక్త పరిస్థితులతో పాటు పర్యావరణ మార్పుల వల్ల ప్రపంచ వ్యాప్తంగా జల మార్గాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని జెనీవా కేంద్రంగా పనిచేసే యునైటెడ్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ పేర్కొంది. అత్యంత చవకయిన ఈ మార్గాల్లో ఇబ్బందుల వల్ల పేదలకు కష్టాలు తప్పడం లేదని ఆ సంస్థ పేర్కొంది. గడిచిన రెండు నెలల్లో సూయజ్ కాలువ ద్వారా జరిగే వాణిజ్యంలో 42% తగ్గిందని వెల్లడించింది.

**మహారాష్ట్ర కోటలు**



- మహారాష్ట్రలోని సైన్య కోటలను యునెస్కో సాంస్కృతిక వారసత్వ జాబితాకు ప్రతిపాదించారు. మరాఠా వంశస్థులు వీటిని నిర్మించారు. వీటిలో కొన్ని తమిళనాడుకు కూడా విస్తరించాయి. సల్హేర్ కోట, శివనేరీ కోట, లోహ్‌గఢ్, ఖందేరీ కోట తదితరాలు ఇందులో ఉన్నాయి. ఇప్పటికే భారత్ నుంచి ఈ జాబితాలో 42 నిర్మాణాలు ఉన్నాయి.

**సదా తన్‌సీక్**



- భారత్-సౌదీ అరేబియాల మధ్య సదా తన్‌సీక్ పేరుతో సైనిక విన్యాసం జనవరి 29న ప్రారంభమయ్యింది. ఫిబ్రవరి 10 వరకు ఇది కొనసాగుతుంది. భారత్, సౌదీ అరేబియాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి కొనసాగింపుగా సైన్యం ఉమ్మడిగా ఈ విన్యాసాలను చేపట్టింది.

## జాతీయం

**శకటాలకు అవార్డులు**

- గణతంత్ర దినోత్సవం రోజున నిర్వహించిన శకటాలకు బహుమతులను ప్రకటించారు. త్రివిధ దళాల్లో ఉత్తమ కవాతు నిర్వహించి వైమానిక దళం అవార్డును గెలుచుకోగా సాయుధ బలగాల్లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ప్రథమ స్థానంలో నిలిచింది.



రాష్ట్రాల వారీగా చూస్తే..

- తొలి స్థానం- గుజరాత్, ఇతివృత్తం హరిత శక్తి వినియోగం
- రెండో స్థానం- ఒడిశా, ఇతివృత్తం వికసిత్ భారత్‌లో మహిళ సాధికారత
- మూడో స్థానం- సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, ఇతివృత్తం భారత్: ప్రజాస్వామ్యానికి మాతృక

**75 ఏండ్ల సుప్రీంకోర్టు**

- సుప్రీంకోర్టులో నిర్వహించిన వజ్రోత్సవ వేడుకలను ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. 1950, జనవరి 28న సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. 1935 చట్టం ప్రకారం సమాఖ్య కోర్టు ఉంది. ప్రస్తుతం భారత న్యాయ వ్యవస్థ యూకేలో లాగా సమీకృతమైంది. అమెరికా తరహాలో స్వతంత్రమైనది.

**5జీ పోర్టల్**

- భారత్ టెలికాం 2024లో భాగంగా 'భారత్ 5జీ పేరుతో ఒక పోర్టల్‌ను ప్రారంభించింది. అంకుర సంస్థలతో పాటు పరిశ్రమలు, అకడమిక్ విద్యలో ఉన్న వాళ్లకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. టెలికాం రంగంలో కూడా సత్వర అభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు ఈ పోర్టల్ ప్రయోజనకరంగా ఉంటుంది.

**బ్యాంకుల కంప్యూటరీ కరణ**

- ఒక జాతీయ ఉమ్మడి సాఫ్ట్‌వేర్ ద్వారా వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకులను కంప్యూటరీకరించాలని సహకార మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 1851 యూనిట్లను అనుసంధానం చేయనున్నారు. ఇందుకు నాబార్డ్ సాయం చేయనుంది. దీనివల్ల విధుల నిర్వహణ సామర్థ్యం పెరగడంతో పాటు పారదర్శకత కూడా మెరుగవుతుంది.

**రాజ్‌మార్గ్ యాత్ర**

- హైవేలకు సమీపంలో ఉండే దర్శనీయ స్థలాలకు సంబంధించి రాజ్‌మార్గ్ యాత్ర అనే ఒక యాప్‌ను కేంద్రం ప్రారంభించింది. సులభంగా వినియోగించుకొనేలా ఉంటుంది. జాతీయ రహదారుల్లో ఉండే చూడదగ్గ ప్రదేశాల సమాచారాన్ని అందిస్తుంది. ఇదివరకే జాతీయ రహదారుల విస్తరణకు సంబంధించి భూమి రాశి అనే పోర్టల్‌ను కూడా ప్రారంభించారు.

**యోగ-నేచురోపతి ఆస్పత్రి**

- ఈశాన్య రాష్ట్రాల్లో తొలి యోగ-నేచురోపతి ఆస్పత్రి అసోంలోని డిబ్రూఘర్‌లో ఏర్పాటు కానుంది. దీని నిర్మాణానికి రూ.100 కోట్లు వెచ్చించనున్నారు.






**వ్యవసాయ కార్బన్ మార్కెట్**

- వ్యవసాయ రంగంలో స్వచ్ఛంద కార్బన్ మార్కెట్‌ను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అర్జున్ ముండా ప్రారంభించారు. చిన్న, సన్నకారు రైతులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. వ్యవసాయంలో పర్యావరణ అనుకూల విధానాలను పెంపొందించేందుకు కూడా ఉపయోగపడుతుంది.

**వృద్ధి రేటు 7 శాతం**

- వరుసగా మూడో ఏడాది భారత వృద్ధి రేటు 7 శాతం నమోదయిందని ఆర్థిక వ్యవహారాల శాఖ విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థ సమీక్ష పేర్కొంది. గడిచిన పది సంవత్సరాల్లో ప్రభుత్వం చేసే మూలధన పెట్టుబడి భారీగా పెరిగిందని ఇందులో పేర్కొన్నారు. 2015-16తో పోలిస్తే మహిళల బ్యాంక్ ఖాతాల్లో 53% పెరుగుదల ఉందని, ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకం వల్లే ఇది సాధ్యమయ్యిందని వెల్లడించింది.

**ఖడ్గమృగం ఐవీఎఫ్**

- ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్ అనే సాంకేతిక ప్రక్రియ ద్వారా ఖడ్గమృగం గర్భం దాల్చేలా కొత్త విధానాన్ని శాస్త్రజ్ఞులు ఆవిష్కరించారు. అంతరించిపోతున్న ఈ జాతిని కాపాడుకునేందుకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అసిస్టెడ్ రిప్రొడక్టివ్ సాంకేతికతను ఇందులో వినియోగిస్తారు.

## తెలంగాణ

**పంచాయతీల సగటు ఆదాయం**




- తెలంగాణలో గత మూడేళ్లలో పంచాయతీల సగటు ఆదాయం రూ.11.52 లక్షలు ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నివేదికలో పేర్కొంది. కేరళ రాష్ట్రంలోని పంచాయతీలకు గరిష్ఠ స్థాయిలో ఆదాయం ఉందని వెల్లడించింది. ఆ రాష్ట్రంలో పంచాయతీల సగటు ఆదాయం రూ.60.69 లక్షలుగా ఉంది.

**పెరిగిన రాబడులు**

- రాష్ట్ర రెవెన్యూ రాబడి, వ్యయాలు గణనీయంగా పెరిగాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తాజా నివేదిక పేర్కొన్నది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి తొమ్మిది నెలల కాలానికి సంబంధించిన గణాంకాలను కాగ్ నివేదించింది. దీని ప్రకారం..
- పన్నుల ఆదాయం రూ.99,693 కోట్లు
- మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ సుంకం రూపంలో రూ.19,984 కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకోగా తొలి 9 నెలల కాలంలో 82.98% వచ్చింది.

**శాసనం గుర్తింపు**

- 12వ శతాబ్దం నాటి కాకతీయ శాసనాన్ని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం బోయలపల్లెలో గుర్తించారు. సామంత రాజు అయిన గంగయ్య సాహిణి ఈ శాసనాన్ని వేయించినట్లు గుర్తించారు.

**ఖేలో ఇండియా కేంద్రాలు**

- తెలంగాణలో 13 ఖేలో ఇండియా విద్యా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అవి..
- కబడ్డీ- హైదరాబాద్, రాజన్నసిరిసిల్ల, సంగారెడ్డి, నాగర్‌కర్నూలు, భూపాలపల్లి, జనగామ

ఉషు- నిర్మల్
షూటింగ్ బాల్- కుమ్రం భీం ఆసిఫాబాద్
బాక్సింగ్- మంచిర్యాల
సైక్లింగ్- మేడ్చల్
పుట్‌బాల్- జోగుళాంబ గద్వాల, మహబూబ్‌నగర్
ఖోఖో- పెద్దపల్లి

**ఆరోగ్య డిజిటల్ కార్డులు**

- రాష్ట్రంలో ప్రజలందరికీ డిజిటల్ ఆరోగ్య కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆయా వ్యక్తుల ఆరోగ్య సమాచారం ఇందులో ఉంటుంది. దీన్ని హెల్త్ ప్రొఫైల్‌గా భావించవచ్చు. అత్యవసర సమయంలో సరైన వైద్యం అందించేందుకు ఇది తోడ్పడుతుంది.

**గద్దర్ పురస్కారం**

- నంది పురస్కారాల పేరును మార్చి ప్రజా యుద్ధనౌక గద్దర్ పేరుతో కవులు, కళాకారులకు అవార్డులు ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అలాగే సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులోని తెల్లాపూర్‌లో గద్దర్ విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 1076.4 చదరపు గజాల స్థలాన్ని ఇందుకు కేటాయించారు.



**సెమెంజా**

- జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ పురస్కారానికి గ్రెగ్ ఎల్ సెమెంజా ఎంపికయ్యారు. ఆయన గతంలో నోబెల్ బహుమతిని కూడా అందుకున్నారు.

**సుద్దాల అశోక్ తేజ**

- తెలుగు భాషారత్న అవార్డుకు ఎంపికయ్యారు.

## వార్తల్లో వ్యక్తులు

**సత్నాం సింగ్ సంధు**



- పంజాబ్ రాష్ట్రానికి చెందిన విద్యావేత్త సత్నాం సింగ్ సంధును రాజ్యసభకు రాష్ట్రపతి నామినేట్ చేశారు. రాజ్యాంగం లోని 80 (3) ఆర్టికల్ ప్రకారం 12 మందిని రాష్ట్రపతి నామినేట్ చేయవచ్చు. కళలు, సాహిత్యం, శాస్త్ర-సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక సేవ చేసే వాళ్లను ఎంపిక చేస్తారు.

**16వ ఆర్థిక సంఘం సభ్యులు**

- 16వ ఆర్థిక సంఘానికి నలుగురు సభ్యులను కేంద్రం ఎంపిక చేసింది. ఆర్టికల్ 280 ప్రకారం రాష్ట్రపతి వాళ్లను నియమిస్తారు. అజయ్ నారాయణ్ ఝా, అన్ని జార్జ్ మాథ్యూ, నిరంజన్ రాజాధ్యక్షలను పూర్తి స్థాయి సభ్యులుగా, సౌమ్య కంటి ఘోష్‌ను పార్ట్ టైం సభ్యుడిగా ఎంపిక చేశారు. 16వ ఆర్థిక సంఘానికి అరవింద్ పనగారియా నేతృత్వం వహించనున్నారు.

## క్రీడలు

**మన్‌దీప్ జంగ్రా విజయం**



- అమెరికాలో నిర్వహిస్తున్న నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ ఇంటర్ కాంటినెంటల్ సూపర్ ఫెదర్‌వెయిట్ పోటీలో భారత్‌కు చెందిన మన్‌దీప్ జంగ్రా గెలిచాడు. తుదిపోరులో అమెరికాకు చెందిన ఇస్మ్యావెల్‌ను ఓడించాడు.

**శ్రీలంకపై నిషేధం ఎత్తివేత**

- శ్రీలంక క్రికెట్ బోర్డు సస్పెన్షన్‌ను ఐసీసీ ఉపసంహరించుకుంది. ప్రపంచకప్‌లో పేలవమైన ఆటతీరును ప్రదర్శించినందుకు శ్రీలంక ప్రభుత్వం అక్కడి క్రికెట్ బోర్డును రద్దు చేసింది. క్రికెట్ బోర్డ్ విషయాల్లో ప్రభుత్వ జోక్యం ఐసీసీ నిబంధనలకు విరుద్ధం. అందుకే సస్పెండ్ చేసి, తాజాగా ఉపసంహరించుకున్నారు.

**తన్మయ్ అగర్వాల్**

- తన్మయ్ అగర్వాల్ టెస్ట్ మ్యాచ్‌లో కేవలం 147 బంతుల్లో 300 పరుగులు చేశాడు. టెస్టుల్లో ఇంత తక్కువ బంతుల్లో 300 పరుగులు చేయడం ఇదే ప్రథమం. రంజీట్రోఫీలో తన్మయ్ అగర్వాల్ ఈ ఘనత తను దక్కించుకున్నాడు. అతడు హైదరాబాద్‌కు చెందిన క్రికెటర్.



వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

